కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 15 జనవరి 2026

## కనులుపండువగా గోదాదేవి కళ్యాణ మహోత్సవం

రామసముద్రం జనవరి 14 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని అతిపురాతన శ్రీలక్ష్మి జనార్ధన స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యానోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పార్ధసారధి బటర్, కులశేఖర్ బటర్ అర్చక బృందం అనిల్ స్వామి, శ్రీనివాస్ ఆచార్ ఉదయం ఆలయ శుద్ధి చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, పలు రకాల పుష్పాలతో స్వామివార్లను అలంకరణ చేసి పట్టు వస్త్రాలు సమర్పించి గోదాదేవి కళ్యానోత్సవం వేద మంత్రాలతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోదాదేవి కళ్యాణ మహోత్సవం వేడుకలు తిలకించడానికి భక్తులు తండోప తండాలుగా తరలివచ్చారు. వీరికి అర్చకులు స్వామివారిని దర్శనం కల్పించి అనంతరం భక్తులకు మహా మంగళ హారతి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెండిశరారి వితరణ

రాజంపేట, జనవరి 14 ప్రభాతవార్త



కడప రేణిగుంట జాతీయ రహదారిలో బోయినపల్లి వద్ద అన్నమయ్య థీమ్ పార్క్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు భోగి పండుగ సందర్భంగా బుధవారం రాజంపేట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని జి. సరిత, ఎన్. పెంచలయ్య దంపతులు వెండి శఠారి ని వితరణచేశారు. ధనుర్మాసంలో ఈనెల 3వ తేదీన కూడా శ్రీ గోదాదేవి శ్రీ మహాలక్ష్మి దేవి సమేత శ్రీ రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఈ దంపతులు వైభవంగా నిర్వహించారు. గత మూడేళ్లుగా ధనుర్మాసంలో వీరు శ్రీ గోదాదేవి శ్రీ మహాలక్ష్మి దేవి సమేత శ్రీ ప్రసన్న రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. రాజంపేట పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రాంతీయ ఇస్కాన్ ఆధ్యాత్మిక కేంద్రానికి కూడా ఈ దంపతులు తమ వంతు సహకారాన్ని అందించడం జరిగింది. స్థానికంగా జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇతోధికంగా సహకారాన్ని, సేవలను వీరు అందిస్తున్నారు.

# కోడి పందెలపై పోలీస్ డేగ కన్ను

### పందాలకు సై అంటున్న యువకులు... గ్రామాల్లో కోడిపుంజులు జోరు

మదనపల్లె, జనవరి 14 ప్రభాతవార్త :



సంక్రాంతి పండుగ రోజున సాంప్రదాయంగా భావించే కోడి పందాల నిర్వహణపై పోలీస్ డేగకన్ను వేసింది. కోడిపందాలు నిర్వహణ పందెందారులు రహస్యంగా కోళ్ళకు కత్తులు కట్టి పందాలు నిర్వహించనున్నారు. బుధ, గురు, శుక్రవారం మూడు రోజులు జిల్లా పరిసర ప్రాంతాల్లో కోడిపందాలను భారీగా నిర్వహించేందకు సిద్ధమయ్యారు. ప్రతి ఏటా బోగి, సంక్రాంతి, కనుమ, మూడు రోజులు కోడి పందాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో పడమటి ప్రాంతాల్లో ఎక్కువగా కోడి పందాలు జరుగుతాయి. ఇప్పటికే ఆయా నియోజకవర్గంలోని సర్కిల్ఇన్స్పెక్టర్లు కోడిపందాలను నిర్వహించరాదంటూ హెచ్చరికలు సైతం జారీ చేశారు. కోడి పందాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ప్రకటనలు ఇచ్చారు. ఈ కోడి పందాలు ఎక్కువగా వందల కోట్లల్లో పందాలు కట్టి నోట్ల కట్టలు చేతులు మారుతాయి. ప్రజాప్రతినిధులు, భూస్వాములు ఏడాదిపాటు ప్రత్యేకంగా పెంచుకొన్న కోడి పుంజులను తీసుకెళ్ళి పందెంలో పాల్గొంటారు. ఒకొక్క పుంజుపైన లక్షలు పందాలు కడుతారు. కాళ్ళకు కత్తులు కట్టి పోటీ పెడుతారు. గతంలో ఎలాంటి అనుమతి లేకుండానే అడవులు,కొండలు, గుట్టలు, చెరువుల్లో రహస్యంగా కోడిపందాలు నిర్వహించేవారు. ఒక రకంగా ఇది ఎన్నో ఏళ్లు గా వస్తున్న సాంప్రదాయం ప్రకారమే ఈ పందాలు నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో పలువురు చెబుతారు. మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు, కురబలకోట, పెద్దమండ్యం, రాయచోటి ప్రాంతాల్లో పందెం పుంజులను ప్రత్యేకంగా పెంచుతున్నారు. ఒకొక్క పుంజుధర రూ.5వేల నుంచి 30వేల వరకు ఉంది. వీటికి ఏడాదిపాటు ప్రత్యేకంగా ఆహారం, విలువైన ధాన్యపు గింజలతో పెంచుతారు. ఎక్కడ చూసినా కోడి పుంజులను పందాలకు తీసుకెలుతూ కనిపించారు. పోలీసులకు కళ్ళుకప్పి పందాలను నిర్వహించి వేలల్లో బెట్టింగ్ వేసుకొన్నారు.

## కలెక్టర్ బంగ్లాలో భోగి మంటల వేడుక

కడప, జనవరి 14 : ప్రభాతవార్త:



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సుపరిపాలనలో ఆకాంక్షిత జిల్లాగా వైఎస్ఆర్ కడప జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందుతున్నందుకు సంతోషంగా ఉందని.. ఈ సంక్రాంతి పండుగ జిల్లా ప్రజలకు మరిన్ని శుభాలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. భోగి మంటల వెచ్చటి వెలుగులు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని మకర సంక్రాంతి కాంతులతో ప్రతీ ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని కనుమ కాంతులతో పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కలకళలాడాలని ఆకాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందని,కొత్త పంటలు చేతికందిన రైతులు, ఇంటినిండా ధాన్య సిరుల సంపదల మధ్య ఆనందంగా జరుపుకునే పండుగే ఈ సంక్రాంతి అన్నారు. సనాతన సంప్రదాయాలను గుర్తుకు తెచ్చి, అల్లుళ్ళు, బంధుమిత్రులతో సరదాగా చేసుకునే పండుగే సంక్రాంతి అన్నారు. ఈ ఏడాది ప్రకృతి అన్నివిధాలా కరుణించి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. సిరుల పంటలు పండాలన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు.

### కలెక్టర్ బంగ్లాలో భోగి మంటల వేడుక

మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో భాగంగా మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా బుధవారం వేకువ జామున వై ఎస్ ఆర్ కడప కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ భోగి మంటలు ప్రతి కుటుంబంలో కొత్తదనాన్ని శుభశకునాలను ఉద్భవిస్తాయని ఆ మంటల వెచ్చటి కాంతులు ప్రతి ఒక్కరికీ నిండైన ఆరోగ్యాన్ని, ఇమ్యూనిటీ పవర్ ను అందిస్తాయని తెలిపారు. జిల్లాలో సంక్రాంతి పండుగ సంబరాలు ఊరూరా ఇంటింటా వెల్లివిరుస్తున్నాయని తొలిరోజు భోగితో మొదలైన సంబరాలు మకర సంక్రాంతి, కనుమతో మూడు రోజుల పాటు కొనసాగనున్నాయన్నారు.

## గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ, 17 గొర్రెలు మృతి





ముద్దనూరు,జనవరి14,ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొత్త చౌటుపల్లె గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గొర్రెల మంద రహదారి దాటుతుండగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ ఒక్కసారిగా గొర్రెల మందపై దూసుకు రావడంతో సుమారు 17 గొర్రెలు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గొర్రెలను మేపుకొని ఇంటికి వెళుతుండగా రహదారిని దాటుతుండగా లారీ అతి వేగంగా గొర్రెల మందపై రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. గొర్రెల యజమాని మంజరి పుల్లన్న కుటుంబ సభ్యులకు ఈ గొర్రెల జీవనాధారముగా బ్రతుకు సాగిస్తున్న మాకు జీవనాధారం కోల్పోవడంతో కన్నీటి పర్వతమయ్యారు. సుమారు రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని గొర్రెల యజమాని పేర్కొన్నారు. గొర్రెల యజమాని ఆదుకోవాలని కోరారు. ఘటన స్థలాన్ని ఎస్సై మైనుద్దీన్ చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### బంతిపూలు పంట రైతు ఇంట సంక్రాంతి

## కాసుల పంటేనా!



సుండుపల్లె,జనవరి 14,ప్రభాతవార్త :

మండలంలోని పత్తి వాండ్ల పల్లె చెందిన అభ్యుదయ రైతు యర్రపురెడ్డి హరినాధ రెడ్డి మామిడి, చీనీకాయల తోటల పెంపకం చేపట్టారు.అంతే కాకుండా నిత్యం సంప్రదాయ పంటలు కాకుండా వాణిజ్య పంటలైన కార్భూజ,దోశ, వంకాయ,పూల తోటలు సాగు చేస్తూ ఉంటారు. ఇప్పుడు తన చీనీ తోటలో అంతరపంటగా రెండు రకాలు బంతి పూలు సాగు చేసారు. ఆ రైతు సంక్రాంతి పండుగ సందర్భంగా మంచి ధరలు పలికి రాబడి వస్తుందని రైతు ఆశగా ఎదురు చూస్తున్నారు.ఈ బంతిపూలు పంట రైతు ఇంట సంక్రాంతి కాసుల పంటేనా ఎదురు చూడాల్సిందే.

## ఘనగా భోగి వేడుకలు

గాలివీడు, జనవరి 14(ప్రభాతవార్త):

మండల వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు గ్రామ ప్రజలు. సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే సమయాన్ని మకర సంక్రాంతి జరుపుకోవడం ఆనవాయితీ. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు భోగి పండుగను జరుపుకుంటారు. అలాగే భోగి రోజు రేగిపళ్లతో చిన్నపిల్లలకు అభ్యంగన స్నానాలు, కొత్తబట్టలు ధరించి దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి హిందువులకు పెద్ద పండుగ కావడంతో కొత్త అల్లుళ్ళ, పిండి వంటలు, రంగవల్లులతో గ్రామాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.



## ప్రీతి భౌతికకాయానికి నివాళులర్పించిన మంత్రి

గాలివీడు, జనవరి 14(ప్రభాతవార్త):



మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లికు చెందిన టీడీపీ నాయకులు కరిమిరెడ్డి కుమార్‌రెడ్డి కుమార్తె ప్రీతి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ఉదయం ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మంత్రి ప్రీతి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రీతి మృతిచెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషాదాన్ని కుటుంబసభ్యులు ధైర్యంగా ఎదుర్కొనేలా భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని ప్రీతికి నివాళులు అర్పించారు.

## పులివెందులలో ఉత్తరాంధ్ర తరహా సంక్రాంతి సంబరాలు

పులివెందుల ,జనవరి 14 , ప్రభాత వార్త :




పులివెందులలో ఉత్తరాంధ్ర తరహాలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ బీటెక్ రవి తెలిపారు. బుధవారం లింగాల మండలం దొండ్లవాగు గ్రామం పరిధిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన బరి వద్ద మీడియాతో బీటెక్ రవి మాట్లాడుతూ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో సాంప్రదాయ క్రీడలు, గ్రామీణ పండుగ వాతావరణంతో ప్రజలు ఆనందంగా సంక్రాంతి వేడుకలు జరుపుకుంటున్నారని అన్నారు. గతంలో పులివెం దుల ప్రాంతానికి చెందిన ప్రజలు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు, ముఖ్యంగా భీమవరం తదితర ప్రాంతాలకు బస్సులు, వాహనాల ద్వారా వెళ్లి అక్కడ జరిగే సంక్రాంతి కార్యక్రమాలు, సాంప్రదాయ క్రీడలు వీక్షించే వారని పేర్కొన్నారు. అలాంటి సంప్రదాయాలను ఇకపై మన ప్రాంతంలోనే కొనసాగించాలని ప్రజలు కోరిన మేరకు పులివెందులలో సంక్రాంతి సంబ రాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పూర్తి బాధ్యతతో ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా పండుగ జరుపు కోవాలన్నదే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పులివెందుల ప్రజలు సంతోషంగా పండుగ జరుపు కోవడం కొంతమందికి నచ్చడం లేదని విమర్శించారు. సంక్రాంతి వంటి పండుగ సందర్భాలలో రాజకీయాలు చేయడం తగదని, ప్రజల ఆనందాన్ని అడ్డుకునే విధంగా ప్రకటనలు ఇవ్వడం సరికాదని అన్నారు. అందరూ రాజకీయాలకు అతీతంగా పండు గను ఆనందంగా జరుపుకోవా లని ఆయన పిలుపునిచ్చారు.

## శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ గోదాదేవిల కళ్యాణం





పులివెందుల , జనవరి 14 , ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలోని పురాతనమైనటువంటి శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో భోగి పండుగన సందర్భంగా శ్రీకృష్ణ గోదాదేవిల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజేష్ శర్మ నాగేంద్ర శర్మల ఆధ్వర్యంలో ఈ కళ్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లెక్చరర్ వెంకటరామిరెడ్డి దంపతులు ఉబయదారులుగా పాల్గొన్నారు. అంతకు ముందు భోగి పండుగను పురస్కరించుకొని ఆలయంలో భోగి మంటలను ఈవో కె.వి.రమణ ఆధ్వర్యంలో ఉదయం వేయడం జరిగింది స్వామివారికి ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు అనంతరం కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కళ్యాణ కార్యక్రమంలో శ్రీ రంగనాథ స్వామి శాశ్వత ఉభయ దారులు చల్లా వంశీయులు శ్రీ గోదామాత విగ్రహ దాతలు కట్టకింది పల్లె ఆది నారాయణ, భక్తవత్సలం నాయుడు చల్లా చంద్రశేఖర్ నాయుడు,అలాగే నూలు పూజ ఉత్సవ ఉభయ దారులు నారాయణ, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ తిరుమల శెట్టి నాగేంద్రప్రసాద్ దంపతులు, శ్రీ రంగనాథ ట్రస్ట్ తరఫున సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యల హాజరయ్యారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

### 30 రోజులు పాటు గీతా పారాయణం గోదాదేవి పాశురాల ఆలపన

శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందినటువంటి రిటైర్డ్ లెక్చరర్ నాగమల్లారెడ్డి పార్వతి దంపతుల ఆధ్వర్యంలో వారి బృందం 30 రోజులపాటు భగవద్గీత పారాయణము, గోదాదేవి పాశురాల ఆలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం చివరి రోజు వారు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా గోదాదేవి రంగనాయకుల కళ్యాణం

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 14 ప్రభాత వార్త

పట్టణంలోని పలు ఆలయాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం గోదాదేవి, రంగనాయకుల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిచారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయం వీధిలోని శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణునికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కళ్యాణ వేదికపై గోదాదేవిరంగనాథ స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణజేసి కొలవుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యానోత్సవాన్ని వైభవంగా జరిపారు. పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవాసంఘం. అధ్యక్షుడు దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శి రాచగొల్ల వెంకటరమణ యాదవ్. కోశాధికారి ఆర్.వెంకటయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారెడ్డియాదవ్, సామిడి రామసుబ్బయ్య యాదవ్, నాగన్న పాల్గొన్నారు. పాతమార్కెట్ లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి సుమూహూర్తంలో కళ్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిపారు అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. బొల్లవరంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుని కల్యాజోత్సవాన్ని క్రమనీయంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరునికి విశేష అభిషేకాలు, ఆర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కళ్యాణ వేదికపై శ్రీకృష్ణుడు, గోదాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఆశీనులను చేసి సుముహూర్తంలో కళ్యాణోత్సవానిన అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేశారు. స్థానిక హౌసింగ్ బోర్డురాలనీలోని శ్రీలక్ష్మీసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు.



## 28 మంది కోడి పందెం రాయుళ్లు,

## పేకాట రాయుళ్లు అరెస్ట్..

### 30750 రూ. నగదు స్వాధీనం.

ములకలచెరువు, జనవరి 14 ప్రభాతవార్త:

స్థానిక కనుగొండ్రాయి స్వామి ఆలయం సమీపంలో బుధవారం కోడి పందాలు, పేకాట ఆడు తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై ప్రతాప్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 28 మంది కోడి పందెం రాయుళ్లు, మరియు పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చారు. వారి వద్ద నుంచి30750 రూ. నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా 12 పందెం కోళ్ళు, ఎనిమిది ద్విచక్ర వాహనాలు,24 నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై3 కోడి పందెం కేసులు1 పేకాట కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రతాప్ తెలిపారు.



# సినీ థియేటర్లలో సినిమా టిక్కెట్లు, తినుబండారాల ధరలు పెచ్చురిల్లితే..!

## థియేటర్లు మూతపడుతాయి-సుప్రీం కోర్టు

**బద్వేలు లీగల్, జనవరి 14 ప్రభాతవార్త:**

నవీన కాలంలో సినిమా అనేది సామాన్యులకు అందుబాటులో వున్న కళ. ఈ కళను ఎంతో కాలంగా సామాన్యులు ఆదరిస్తూనే వున్నారు. అయితే ప్రస్తుత కాలమానంలో సినిమా చూడాలంటే సామాన్యుడి జేబుకు చిల్లు పడాల్సిందే అన్నట్లుగా పరిస్థితులు ఉద్భవించాయి. క్రొత్త సినిమా విడుదలైతే చాలు.. టిక్కెట్ల ధరల నుండి థియేటర్లలో అమ్మే తినుబండారాల వరకూ సినీ ప్రేక్షకులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై సామాన్య సినీ ప్రేక్షకులలో వున్న ఆగ్రహాన్ని సుప్రీం కోర్టు కూడా తనదైన శైలిలో గట్టిగా వినిపించింది. మల్టీప్లెక్స్‌లలో అధిక ధరల విధానం ప్రేక్షకులను థియేటర్ల నుండి దూరం చేస్తోందని అసహనం కూడా వ్యక్తం చేసింది. దీనిని నియంత్రించకపోతే సినిమా థియేటర్లు ఖాళీ అవడం ఖాయం అని, మూతపడడం తప్పదని ధర్మాసనం హెచ్చరించింది. వివరాలలోకి వెళితే... కర్ణాటక రాష్ట్రంలో ఏ సినిమా టిక్కెట్టు ధర కూడా 200 రూపాయలకు మించకూడదని కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అప్పీలు చేస్తూ మల్టీప్లెక్స్ థియేటర్ల యజమానులు సుప్రీం కోర్టును ఆశ్రయించగా జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి థియేటర్లలో విక్రయించే ఆహార, పానీయాల ధరలపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ "ఒక్క నీళ్ళ బాటిల్‌కు రు.100, కాఫీకి రు.700 వసూలు చేస్తారా?" అని నిలదీసింది. ఈ ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకపోతే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతుందని ధర్మాసనం అభిప్రాయపడుతూ "ప్రస్తుత రోజుల్లో ఒక సగటు కుటుంబం మల్టీప్లెక్స్‌లో సినిమా చూడాలంటే టిక్కెట్లు, స్నాక్స్, పానీయాలతో కలిపి రు.1500 నుండి సుమారు 2 వేల రూపాయలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని, బయట 50 రూపాయలు ఉన్న కూల్‌డ్రింక్ థియేటర్‌లో 400 రూపాయలకు పైగా ఉందని, ఒక చిన్న పాప్‌కార్న్ టబ్ 500 రూపాయలకు పైగా అమ్ముతున్నారు, ఈ ధరల వల్ల సామాన్యుడికి సినిమా చూడాలనే ఆనందం లేకుండా పోతోంది." అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో మల్టీప్లెక్స్ అసోసియేషన్ తరుపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదిస్తూ "ఇది ఐచ్ఛికం అని, ధర ఎక్కువ ఉంటే ప్రేక్షకులు మామూలు థియేటర్లకు వెళ్ళవచ్చు, మల్టీప్లెక్స్‌కే ఎందుకు రావాలి?" అని ప్రశ్నించగా దానికి ధర్మాసనం ఘాటుగా బదులిస్తూ "ఇప్పుడు మామూలు థియేటర్లు మిగలడం లేదు, టిక్కెట్టు ధర 200 రూపాయలు ఉండాలనే హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాన్ని తాము గట్టిగా సమర్థిస్తున్నాం" అని సుస్పష్టం చేసింది. ప్రస్తుతం ఓటిటి ప్లాట్‌ఫామ్స్ నుండి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్న సినీ పరిశ్రమకు అధిక ధరలు మరింత నష్టం కలిగిస్తున్నాయి, గతంలో ఓ ప్రముఖ సినీ నిర్మాత కూడా ఓ సినిమా చూడటానికి 10 వేలు రూపాయలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు, ఓ సర్వే ప్రకారం అధిక ధరల కారణంగా కరోనా తరువాత థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య 15 శాతంకు తగ్గిందని, టిక్కెట్టు కౌంటర్లలో మాత్రం నగదు చెల్లించి టిక్కెట్లు కొనుగోలు చేసే వారి గుర్తింపు కార్డు వివరాలు సేకరించాలనే కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులు అసాధ్యం అని మల్టీప్లెక్స్ అసోసియేషన్ వాదించింది. ఈ వాదనను పరిగణన లోనికి తీసుకున్న సుప్రీం కోర్టు తక్షణమే ఐడి వివరాల సేకరణ ఉత్తర్వులపై స్టే విధిస్తూ సినిమా టిక్కెట్లు, తినుబండారాల ధరలు ప్రేక్షకులకు చుక్కలు చూపిస్తున్నాయని, ఇలా అయితే థియేటర్లు మూతపడుతాయని సుప్రీం కోర్టు ఘాటుగా తెలియజేసింది. (మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మరియు ఇతరులు ఎదిరి కర్ణాటక స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మరియు ఇతరులు పిటీషన్(ఎస్) ఫార్ స్పెషల్ లీవ్ పిటీషన్ టు అప్పీల్(సి) నెం.31267/2025.

# వైభవంగా గోదాదేవి కళ్యాణ మహోత్సవం

## విశేష సంఖ్యలో కళ్యాణాన్ని తిలకించిన భక్తులు

**బద్వేల్ అర్బన్ జనవరి 14 ప్రభాతవార్త :**

బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్డులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఈవో రామలింగారెడ్డి, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రమేష్ శర్మ మంత్రోత్సవాల మధ్య స్వామివారికి తెల్లవారుజామున వివిధ రకాల ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, ధనుర్మాసం పురస్కరించుకొని ఇటీవల అమ్మవారికి ఆలయంలో విశేష పూజలను కనుల పండగ నిర్వహించారు, బుధవారం రామనబోయిన పుల్లయ్య సతీమణి కృష్ణమ్మ కుమారుడు త్రిబుల్ ఆర్ వి ఎం కంపెనీ యం,డి మురళి యాదవ్ సతీమణి సునీత, రాచపూడి నాగభూషణం కళ్యాణమండపం అధినేత డాక్టర్ రాచపూడి దిలీప్ గుప్తా సతీమణి హైమావతి కుటుంబ సభ్యుల సహకారంతో కనుల పండగగా గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు,స్వామివారి కల్యాణ మహోత్సవంలో పట్టణ పరిసర ప్రాంతంలోని పలువురు భక్తాదులందరూ పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలక్సించారు, ధనుర్మాసంలో గోదాదేవి అమ్మవారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమం చేపట్టడం వలన అనేక శుభ ఫలితాలు సిద్ధిస్తాయని సకాలంలో వర్షాలు పడుట పాడిపంటల అభివృద్ధి మరియు వ్యాపారం సంతాన ప్రాప్తి కలుగుతుందని వేద పండితులు కళ్యాణ విశిష్టతను భక్తాద్నులదరికీ విరివిరిగా తెలియజేశారు,స్వామి వారి కళ్యాణ మహోత్సవం మరియు పూలు అలంకారం సహకరించిన రామనబోయిన పుల్లయ్య రాచపూడి దిలీప్ గుప్తా కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో శాలువాతో సత్కరించి వారికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు,ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.




# మెడికల్ కాలేజీ వద్ద భోగిమం టల్లో జీవో పత్రాలను దగ్ధం చేసిన సీపీఐ నాయకులు

**పులివెందుల ,జనవరి 14 , ప్రభాత వార్త :**

సామాన్యులకు వైద్య విద్య, వైద్యం దూరం చేసే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జివో నెం 590, 847 రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని బుధవారం పులివెందుల మెడికల్ కాలేజీ వద్ద బోగిమంటల్లో జి ఓ ప్రతుల దగ్ధంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల వలరాజు సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాతూ ప్రభుత్వం నూతన వైద్య కళాశాలల్లో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్నర్ షిప్ (పిపిపి) విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరమైనది అన్నారు. ఈ విధానం సామాజిక న్యాయం, విద్యార్థుల హక్కులు, ఉపాధి భద్రత, పేద, మధ్యతరగతి వర్గాల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతుంది అని హెచ్చరించారు. ఇది రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలకు విరుద్ధమై, సామాజిక వర్గాల అభ్యున్నతికి భంగం కలిగించే చర్య అన్నారు. రాష్ట్రంలోని 10 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరిం చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నంబర్ 590ని జారీ చేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇది కేవలం వైద్య విద్య వెనుక ఉన్న సామాజిక లక్ష్యాన్ని కాకుండా, ఆ విద్యకు అనుబంధమైన ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేద ప్రజల వైద్య సేవలకు కూడా దూరం కలిగిస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రా యాన్ని గౌరవించి జివో నెం: 590 తక్షణమే ఉపసంహ రించాలి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జివోలు 107, 108లను రద్దుచేయాలి. నూతన వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి, నిర్వహించాలి. కార్యక్రమంలో సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి కొత్త కాల్వ బ్రహ్మం, ఏ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బత్తల శివతేజ ఏఐటిసి ఏరియా నాయకులు బత్తల మల్లేష్ పార్టీ సిపిఐ పులివెందుల పట్టణ నాయకులు సుభాన్ భాష, జగదీష్ ,రూపకాంత్ ,విద్యార్థి నాయకులుబి.ఈశ్వరయ్య ,శశిధర్ వీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# భోగిమంటలతో ఉప్పొంగిన సంక్రాంతి సంబరాలు




**మైదుకూరు, జనవరి 14, ప్రభాతవార్త:**

మైదుకూరు పట్టణ గ్రామాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా హిందువుల్లో కుటుంబ సభ్యులతో పిల్లల ఆటల పాటలతో భోగి మంటలతో ఉప్పొంగిన సంక్రాంతి సంబరాలు,సాంప్రదాయ కార్యక్రమాలు, రంగవల్లులు, పిల్లల ఆటపాటలతో పట్టణ గ్రామ గ్రామాన పల్లెలో పండుగ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు పెద్ద ఎత్తున సంక్రాంతి ముగ్గులతో అలరారుతున్న తెలుగు లోగిళ్లలో భోగి పండుగ జరుపుకున్నారు.తెలుగు ప్రజలు రైతులు పంటలు ఇంటికొచ్చే వేళ, పశు సంపద పరవశించే వేళ, అందరికీ ఆనందం పంచే నేల, ఇంటి ముంగిటిలో వాలిన వేళ రైతుల్లో ఆనందంతో పాటు కొత్త అల్లుళ్ళ, రాకతో సందడి మొదలై కుటుంబ సభ్యులు అందరూ ఏకమై ఇంటిలో ఆనందం వేల సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. సంక్రాంతి అంటే...ప్రతి ఒక్కరూ సొంతూళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులు, బంధువులతో జరుపుకునే అతిపెద్ద పండుగ. కుటుంబసభ్యులతో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. మైదుకూరు నడిబొడ్డున వెలసిన టువంటి శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ మాధవరాయ స్వామి సంక్రాంతి వేడుకలలో భాగముగా తొలి రోజు భోగి పండుగ పురస్కరించుకొని గజ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడై పాతూరు పురవీధుల్లో ఊరేగింపుతో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ బద్వేల్ రోడ్డు గాంధీ నగర్ వాసుల ఆధ్వర్యంలో రాములు గుడి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా భోగి మంటలతో సంక్రాంతి తెలుగు కాంతులతో సంప్రదాయ దుస్తులతో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. పట్టణంలో అనేకచోట్ల ముగ్గుల పోటీలతో మహిళలను ఉత్సాహపరస్తు సంక్రాంతి సంబరాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది.

## ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం

**పెద్దమండెం జనవరి 14 ప్రభాతవార్త**

మండలంలోని మిట్టమాలపల్లిలో బుధవారం జరిగిన ముగ్గుల పోటీల్లో పిల్లలు పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు పిల్లలు పెద్దలు మొత్తం సుమారు 50 రకాల ముగ్గులను వేశారు అందులో 20 సంవత్సరంలో పిల్లలు జ్యోత్స్న మొదటి స్థానం పల్లవి రెండో స్థానం మోనిక మూడో స్థానంలో నిలిచారు అలాగే పెద్దలు వేసిన ముగ్గుల్లో రెడ్డి ఈశ్వరమ్మ మొదటి స్థానం మండెం రెడ్డమ్మ రెండవ స్థానం కృష్ణమ్మ మూడవ స్థానం లో నిలిచారు వీరికి ముగ్గుల పరిశీలన న్యాయ నిర్ణయాలుగా పెద్ద మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు బీటెక్ సుమన్ పాల్గొన్నారు. విజేతలకు సుమన్ బహుమతులు ప్రధానం చేశారు దీంతో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండ్యం జయరాం ఫారుక్ మల్లికార్జున మన్యం జయచంద్ర పాల్గొన్నారు.



# మండలంలో వైభవంగా సంక్రాంతి వేడుకలు

**దువ్వూరు, జనవరి 14, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సంక్రాంతి పండుగ వేడుకలు వైభవంగా ప్రారంభించారు. బుధవారం ప్రతి ఇంటి ముందు భోగి మంట వేసి సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. అలాగే గురు, శుక్రవారాల్లో కనుమ పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన పాత దువ్వూరులో వెలసి వున్న శ్రీ కోదండరామ స్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

# గరుడ ఆర్థిక సహాయం మొత్తం పెంచండి

**వేంపల్లి: జనవరి:14 ప్రభాతవార్త**



రాష్ట్రములో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణ లకు జరిగే మేలు గరుడ పథకం అని దాని మొత్తం పెంచితే బ్రాహ్మణులకు మేలు జరుగుతుంది అని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీయెస్ వి ప్రసాదరావు. సూగురు రఘునాథ రావులు ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు.ఇటీవల బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత త్వరలోనే బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా గరుడ పథకం అమలు చేస్తామని ప్రకటించడం హర్ష నీయమని అందుకు మంత్రి కి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నట్లు తెలిపారు. అయితే 2015లో అమలు చేసిన 10000రూపాయలు ఇస్తామని ప్రకటించరని ప్రస్తుత పరిస్థితి లో అది సరిపోదని అన్నారు. ఇప్పటికే పలు చోట్లబ్రాహ్మణ లు వారి కుటుంబ సభ్యులు చనిపోతే ఆర్థిక సహాయం చేయమని పలు బ్రాహ్మణ సంఘాలను కోరుతున్నారని అది వైసీపీ వారికీ విమర్శించడానికి అవకాశం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. బ్రాహ్మణ సంక్షేమ కోసం చంద్రబాబు నాయుడు కోర్పొరేషన్ ఏర్పాటు చేసి బ్రాహ్మణులను ఆదుకొనే ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం హయాంలో బ్రా హ్మణులకు మేలు జరగలేదని అన్నారు. 2015కు ఇప్పటికి ఖర్చులు విపరీతం గా పెరిగాయని అందువలన 10000రూపాయలకు బదులుగా 20000 రూపాయలు మంజూరు చేస్తే బ్రాహ్మణ లకు ఎంతో మేలు చేసిన వారు అవతారని మంత్రి ఈ విషయం లో త్వరిత గతిన నిర్ణయం చేయాలనీ విజ్ఞప్తి చేసారు. 2019 ఎన్నికలు సమయం లో అప్పటి చైర్మన్ ఆనంద సూర్య ఎన్నికల తర్వాత అధికారం లోకి వస్తే 15000 రూపాయలు గరుడ పథకం కింద ఇస్తామని ప్రకటించరని గుర్తు చేసారు. 5 సంవత్సరాలనలో తర్వాత గరుడ పథకం అమలు కు నిర్ణయం తీసుకున్నారు కాబట్టి కార్పొరేషన్ చైర్మన్ మరియు డైరెక్టర్ లు ఈ విషయం పై. ప్రభుత్వందృష్టికి తీసుకొని పోవా లని. కోరారు.

# ముగ్గుల పోటిల్లో విజేతలకు బహుమతులు



**వేంపల్లె:జనవరి 14:(ప్రభాత వార్త)**

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటిల్లో విజేతలకు వేంపల్లె గ్రామ పంచాయతీ మాజీ ఇంఛార్జీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు బహుమతులను ప్రధానం చేశారు. బుధవారం స్థానిక శ్రీగౌరీదేవి ఆలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు ఈ పోటిల్లో పాల్గొన్నారు. అనంతరం న్యాయ నిర్ణేతలు విజేతలను ప్రకటించారు. మాజీ ఇంఛార్జీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు చేతుల మీదుగా మొదటి, ద్వితీయ, తృతీయ, నాల్గో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపాలని, సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటిలను నిర్వహించి, తగిన బహుమతులు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో పండుగ వాతావరణం ద్వారా ఆనందాన్ని, ఆయురారోగ్యాలని ప్రసాదించాలని ఆ భగవంతున్ని కోరారు. అలాగే బలిజ సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మాజీ ఇంఛార్జీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు సహాకారంతో ఈ పోటీలు ఏర్పాటు చేసి, బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. అనేక ఏళ్లుగా ఇక్కడ ఏ కార్యక్రమం జరిగిన రాచినేని శ్రీనివాసులు ముందుండి స్పాన్సర్‌షిప్ చేయడం సంతోషకరమన్నారు. అలాగే ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, గౌరవాధ్యక్షుడు కొత్తూరు రెడ్డయ్య, కార్యవర్గ సభ్యులు బాలం నర్సయ్య, నల్లాగు నిత్యానంద, కొత్తూరు జగన్, సిద్దారెడ్డి, గాలిహరిప్రసాద్, ముత్యాల అంజీ, ఆరుశ్వేల రాయుడు, ప్రసాద్, చెండ్రాయుడు, తిరుమలశెట్టి రవి, న్యాయ నిర్ణేతలు అలివేలమ్మ, ప్రవీణ, సౌజన్య, రత్న, నాయకులు కసిరెడ్డి ఆది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం వీరబాదుడు ప్రభుత్వం..

**వేంపల్లి: జనవరి 14 ప్రభాతవార్త**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దంచుడు ప్రభుత్వంగా,బాదుడు ప్రభుత్వంగా, వీర బాదుడు ప్రభుత్వంగా తయారు కావడం దురదృష్టకరం, శోచనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏరు దాటినంతవరకు ఓడ మల్లన్న, ఏరు దాటాక బోడి మల్లన్న అనే విధంగా రాష్ట్రంలో కూటమిపాలన తయారైందని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వం దంచుడు ప్రభుత్వంగా, వీర బాదుడు ప్రభుత్వంగా తయారైందని, తాము అధికారంలోకి వస్తే చార్జీలు గాని, పనులు గాని పెంచనే పెంచమని,ఇంకా వీలైతే తగ్గిస్తామని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చాయి. ప్రజలు నమ్మి ఓట్లు వేశారు.అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్లేటు ఫిరాయించడం దురదృష్టకరం. కూటమి పార్టీలు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అనేక రూపాలలో బాదుడు కార్యక్రమం చేస్తోంది. కోడలికి బుద్ధి చెప్పి అత్తతెడ్డ నాకింది అన్న సామెతను కూటమి ప్రభుత్వం జ్ఞాపకం చేస్తోంది అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. బాదుడు కార్యక్రమం ఇలాగే కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా కూటమి ప్రభుత్వానికి బాదు డు కార్యక్రమం ద్వారా బుద్ధి చెబుతారని తులసి రెడ్డి హెచ్చరించారు.

# విబిజి రాం జీ స్కీంను రద్దు చేయాలని దగ్ధం

**కలసపాడు జనవరి 14 ప్రభాతవార్త:**

2005లో మహాత్మా గాంధీ పేరుతో వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో నరేంద్ర మోడీ ఎన్డీఏ ప్రభుత్వం రద్దుచేసి ఆ స్థానంలో కోట్ల మందికి హామీ లేకుండా గ్యారెంటీ అనే అంశాన్ని కాలరాశి,జాతిపిత మహాత్మా గాంధీ పేరు స్థానంలో జి రాంజీ పేరుతో తెచ్చిన నూతన చట్టం వల్ల 20 కోట్ల మంది గ్రామీణ పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సగిలి గురవయ్య తెలిపారు. బుధవారం ఉదయం కలసపాడు మండలం ముద్దం వారిపల్లె గ్రామంలో ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భోగిమంటలలో విబి జి రాంజీ స్కీమ్ జీవోలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు యంబడి పోలయ్య మాట్లాడుతూ 2005 ఉపాధి హామీ చట్టం అమలు జరిగిన చోట గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనతో పాటు, సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్రం తోపాటు భూస్వామ్య వర్గాలతో బేరమాడే శక్తి పేదలకు కల్పించిందన్నారు. లక్షలాది ఎకరాల పేదల భూమీ అభివృద్ధి జరిగింది. కరోనా సమయములో దేశమంతా చిన్న భిన్నమైన గ్రామీణ ఉపాధి హామీ చట్టం కోట్లాదిమందికి ఉపాధి చూపించి అన్నం పెట్టింది. ఆంధ్రప్రదేశ్ లో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి ఆ చట్టంలోని కీలకమైనటువంటి అంశాలు గ్యారెంటీ , 90:10 ని రద్దుచేసి రాష్ట్రాలకు భారం పడేలా 40 శాతం నిధులు ఖర్చు పెట్టాలని , 73, 74 పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా స్థానిక సంస్థలకు అధికారాలు లేకుండా పని హక్కును కాలరాస్తూ జి రాంజీ చట్టం చేయడం కోట్లాది మంది పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది కాబట్టి 2005 మహాత్మా గాంధీ పేరు మీద ఉన్న చట్టాన్ని యధా విధంగా అమలు చేసి ఆ చట్టాన్ని మరింత బలం చేస్తూ కుటుంబానికి రెండు వందల రోజులు పని కేంద్ర బడ్జెట్ లో రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని నూతనంగా తెచ్చిన జి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రంలో జెమ్స్ దావీదు, నాగన్న, వెంకటయ్య, ప్రమీల లూతమ్మ, భారతి పాల్గొన్నారు.



# గురివి రెడ్డికి నివాళు

**పోరుమామిళ్ల రూరల్, జనవరి 14 ప్రభాతవార్త:**

బద్వేల్ నియోజకవర్గం కలసపాడు మండలం, ముద్దంవారి పల్లె గ్రామ వాస్తవ్యులు అంకన నారపు రెడ్డి కుమారుడు గురివి రెడ్డి (62) అనారోగ్య కారణాలవల్ల మంగళవారం స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైసిపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి పార్థివ దేహము పై పుష్పగుచ్చమును ఉంచి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కలసపాడు మండలం ముద్దంవారి పల్లె గ్రామానికి చెందిన అంకన నారపురెడ్డి కుమారుడు బాల గురివి రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వారి స్వగృహం కి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గురివిరెడ్డి, మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# బద్వేల్‌లో ఘనంగా మకర జ్యోతి దర్శనం.

**గోపవరం. జనవరి. 14. ప్రభాతవార్త.**



శ్రీ.హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం నెల్లూరు రోడ్డు బద్వేల్ మకర సంక్రాంతి సందర్భంగా ఇవాళ్టి రోజున అయ్యప్ప స్వామి ఆలయంలో ఎక్కువ జాము నుండే పంచామృతం అభిషేకాలు మరియు మహా అద్భుతంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు నైయాభిషేకం కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. సాయంత్రం జ్యోతి దర్శనం తదనంతరం ఇక్కడికి వచ్చినటువంటి భక్తులకు తీర్థప్రసాదాలు అభిషేకం అయిన నెయ్యి అందజేయడం అయితే జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ఏపీ ఐఐసి. డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డిని ఆలయ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు ఘనంగా శాలువాతో సత్కరించి ఆయనకు తీర్థప్రసాదాలు అందజేయడం అయితే జరిగింది ఆలయ అభివృద్ధికి ఎంతగానో సహకరించినటువంటి శ్రీ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డిని ఆలయ చైర్మన్ సముద్రాల విజయ్ కుమార్ శాలువాతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ కాలేజ్ అధినేత రాజ్ పుడు రాచపూడి సాయి కృష్ణ రాయడం జరిగింది. అలాగే 41 రోజులు బిక్షకు సహకరించినటువంటి దాతలను ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో బాణాసంచా ఎంతో ప్రత్యేకమైనటువంటి ఆకర్షనీయంగా నిలిచింది బద్వేల్ సుందరయ్య కాలనీ శ్రీకృష్ణ కోలాటం వారిచే అద్భుతంగా కోలాటం జరిగినది తదనంతరము అల్పాహారం ఏర్పాటు చేసినారు. ఆలయ అభివృద్ధికి సహకరించినటువంటి ప్రతి ఒక్క దాతలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బద్వేల్ భక్తులు మహిళలు. ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# అలసట లేకుండా పని చేయాలంటే !



**ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులు.. క్షణం తీరి కుండదు.. ఒత్తిడి, అలసట.. ఈ విధంగా అలసట రాకుండా ఉండాలంటే శరీరంలో తగినంత శక్తి ఉండాలి. మరి ఆ శక్తి రావాలంటే ఏం చేయాలి?**

ప్రొటీన్లు మెండుగా ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీర కండర వ్యవస్థ దృఢమవుతుంది. దీంతో ఎలాంటి అలసట లేకుండా సునాయాసంగా పనులు చేసుకోవడం సాధ్యమవుతుంది. అలాగే ప్రొటీన్లు గుండె బలంగా ఉండేందుకు, రోగ నిరోధకశక్తిని పెంపొందిం చేందుకూ దోహదం చేస్తాయి.



అవసరమైన మేరకు ప్రొటీన్లు లభించే ఆహారం తీసుకుంటే తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండిన భావన కూడా కలుగుతుంది.

**నట్స్...** ప్రొటీన్లతో నిండిన బాదం పప్పు, పిస్తా, అక్రోట్ వంటి గింజలను ప్రతిరోజూ పరిమి తంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయి. సలాడ్లు కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలి.

**పాలు, పాట పదార్థాలు ...** ...కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు తగ్గటానికి తడ్పడతాయి. ఈ క్రమంలో తక్కువ కొవ్వు ఉండే పాల పదార్థాలను తీసుకోవాలి.

**సోయాబీన్స్ ..**



సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మెతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. మామూలు పాలలో మాదిరిగానే సోయా పాలలోనూ ప్రొటీన్ ఉంటుంది. అయితే ఇవి కొంతమంది పడకపోవచ్చు. అలాంటి తీసువకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.

- ✦. అలాగే బఠానీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది.
- ✦ చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.
- ✦ ఇతర మాంసాహార పదార్థాల్లో కూడా ప్రొటీన్లు దండిగా ఉంటాయి. అయితే వీటిల్లో కొవ్వు కూడా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మితంగానే తినాలి. ఈ క్రమంలో చర్మం తీసేసిన చికెన్ తీసుకోవడం మంచిది. అలాగే కోడి గుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది.కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, గుండెజబ్బు, మదుమేహం వంటి సమస్యలు ఉన్నవారు డాక్టర్ల సలహా మేరకే ఎన్ని గుడ్లను తినొచ్చో నిర్ణయించుకోవాలి.



## రంగవల్లులతో పులకించిన రెడ్డికోట



తంబళ్లపల్లె జనవరి 14 ప్రభాతవార్త ః

మన హిందూ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ శ్రీజ మహిళా ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో రెడ్డికోటలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించడంతో స్థానిక ప్రజలు పులకించిపోయారు. బుధవారం భోగి పండుగ సందర్భంగా తురకపల్లి క్లస్టర్ పరిధిలోని రెడ్డి కోట డైరీ ప్రాంగణంలో డైరీ మహిళా చైర్మన్ శ్రీదేవి సారథ్యంలో మహిళల రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొని మన సంస్కృతి సాంప్రదాయ కోలాటాలు వేసి అలరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీదేవి మాట్లాడుతూ మన హిందూ పండగలు మన సంస్కృతికి నిలువుటద్దమని వాటిని కొనసాగించి నేటి ఆధునిక సమాజానికి స్ఫూర్తి నివ్వాలన్నారు. సంక్రాంతి పండుగ వేళ పచ్చటి గ్రామ సీమల్లో ప్రకృతి వ్యవసాయతో పాడి పంటలు అభివృద్ధి చెంది పల్లె సీమల లోగిళ్లు సంక్రాంతి సంబరాలతో కళకళ లాడాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీలో ప్రతిభ కనబరిచిన మహిళలకు చైర్మన్‌తో పాటు డైరెక్టర్ చంద్రకళలు మొదటి, ద్వితీయ బహుమతులుగా చీరలు, బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ మధుసూదన్, ఏరియా మేనేజర్ ఎర్రి స్వామి, శ్రీజ డైరీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, జనవరి 14 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని సుమారు 47మంది లబ్ది దారులకు రూ.51లక్షల చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారుల ఇండ్లవద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి నిరుపేదలకు ఓ వరం లాంటిదన్నారు. అర్హులుగా ఉన్న ప్రతి ఒక్కరికి సిఎం సహాయనిధి కింద నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ నవీన్‌చౌదరి, నాయకులు ఎస్‌ఎ.మస్తాన్, చిన్నమహేష్, సుబ్బరాజు, ఎస్‌ఎం.రఫి, మల్లికార్జుననాయుడు, కమలాకర క్రిష్ణ, బిల్డర్ రామక్రిష్ణ, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, కత్తి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్ ప్రారంభం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె, జనవరి 14 ప్రభాతవార్త :

మదనపల్లె నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, తంబళ్ళపల్లె మల్లయ్యకొండ మాజీ ఛైర్మెన్, ఛైర్మెన్ మనూజా, కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతిలు బుధవారం వైఎస్‌ఆర్ టీచర్స్ యూనియన్ 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి బలోపేతానికి టీచర్స్ యూనియన్ నాయకులు కృషి చేయాలన్నారు. వైకాపా అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పి.రెడ్డప్పరెడ్డి, జనరల్ సెక్రటరీ డి.మోహన్‌రెడ్డి, నాయకులు విష్ణువర్థన్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాగరాజు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భోగి మంటల్లో పిపిపి జీఓ పత్రాలు దగ్ధం

### సిపిఐ, సిపిఎం నాయకులు నిరసనలు

మదనపల్లె, జనవరి 14 ప్రభాతవార్త :



బోగిమంటల్లో దగ్ధం చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ వైద్యకళాశాల పిపిపి విదానాన్ని రద్దు చేయాలని వైద్య విద్యకు శాపంగా మారిన జీఓనెంబర్ 107, 108, 590లను రద్దు చేయాలని పత్రాలను సిపిఐ నాయకులు క్రిష్ణప్ప ఆధ్వర్యంలో బోగిమంటల్లో దగ్ధం చేశారు. అదే విధంగా కొత్తగా తీసుకొచ్చిన ఉపాధిహామీపత్రాన్ని రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు బోగిమంటల్లో పత్రాలను బోగిమంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వవ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని రద్దు చేయాలన్నారు. ప్రైవేటు విధానంతో నిరుపేదలకు వైద్యం అల్లంత దూరానా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పిపిపి విధానాన్ని రద్దు చేయాలన్నారు. మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకాన్ని యదావిధిగా కొనసాగించి కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. కొత్తచట్టం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సాంబశివ, చంద్రా, శ్రీనివాసగౌడ్, అంజాద్‌లతో పాటు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.నాయకులు పాల్గొన్నారు.

## బెంగుళూరు బస్టాండ్ మార్చితే సహించం

మదనపల్లె, జనవరి 14 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న షమీంఅస్లాం

ప్రజలందరికి సౌకర్యంగా ఉన్న బెంగుళూరు బస్టాండ్‌ను ఉన్నఫలంగా మార్చితే సహించేది లేదంటూ వైసిపి మహిళా నాయకురాలు, మాజీ రాష్ట్ర ఖనిజ సంపద ఛైర్‌పర్సన్ షమీంఅస్లాం, వైస్‌ఛైర్మెన్ నూర్‌అజాంలు తెలిపారు. బుధవారం బెంగుళూరు బస్టాండులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా పట్టణ నడిబొడ్డున ప్రయాణీకులు, ప్రజలకు సౌకర్యంగా ఉన్న బెంగుళూరు బస్టాండును వక్ఫ్‌బోర్డు స్థలాల్లోకి మార్చితే సహించేది లేదన్నారు. వక్ఫ్‌బోర్డు స్థలం ఎవరికి ఎలాంటి హక్కు లేదని మైనార్టీల మనోభావాలను దెబ్బ తీసేందుకే బెంగుళూరు బస్టాండును కదిరిరోడ్డులో ఉన్న టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్ వద్ద వక్ఫ్‌బోర్డు స్థలంలోకి మార్చేందుకు యత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో బస్టాండులు ఏర్పాటు చేయాలని కాని వక్ఫ్‌బోర్డు స్థలంలో బస్టాండు పెడితే ఉపేక్షించం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫర్జానా రఫి, షబానా కరీముల్లా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణారెడ్డి 91వ జయంతి

చౌడేపల్లి, జనవరి 14 ప్రభాతవార్త



రాజకీయాల్లో నూతన శకానికి నాందిపలికిన వ్యక్తిగా మాజీ ఎంపి దివంగత నూతనకాల్వ రామకృష్ణారెడ్డి నిలచిపోయారని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. మాజీఎంపి రామకృష్ణారెడ్డి 91వ జయంతిని పురష్కరించుకొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండులోని ఆయన విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రస్తుతం ప్రజాధారణ పొందిన నాయకులకు రాజకీయ ఓనమాలు నేర్పించిన ఆయన నేటి నేతలకు ఆదర్శమన్నారు. బస్టాండులో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంపార్టీ నాయకులు పూల చంద్రమౌళి, పంజానిపల్లి బాబునాయుడు, పవన్‌కుమార్, నారాయణరాజు, గిరినాయుడు, దాదేపల్లిగణి, చెంగ్రాయుడు, వెంకట్రమణ, ప్రభాకర్, ఆమినిగుంట శంకర, కుమార్‌రెడ్డి, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండుగదినం అపూర్వ సమ్మేళనం

మేకలచిన్నేపల్లి(చౌడేపల్లి), జనవరి 14 ప్రభాతవార్త



పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

లోకమంతా భోగి పండుగను భక్తిశ్రద్దలతో చేసుకొంటుంటే పాతనేస్తాలు ఒక చోటు చేరి తమ మధురానుభూతులను పంచుకొన్నారు. మండలంలోని శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లి ఉన్నతపాఠశాల పూర్వపు విద్యార్ధులు(2004-05) పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకొన్నారు. ఉపాధ్యాయులను దుశ్శాలవాలతో సత్కరించారు. పూర్వపు విద్యార్ధులు (2003-04)ఇరువురు కలసి రూ. 5లక్షలతో ప్రార్ధనా మందిరం(షెడ్డు)ను నిర్మించి పాఠశాలకు అంకితం చేసారు. దాదాపు 20యేళ్ళ తర్వాత వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకొని ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. హోదాలు మరచి అందరూ కలసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. వ్యాపార, విద్యా వేత్తలుగా, కర్షకులుగా ఉన్నవారందరూ స్థాయి విడచి చట్టాపట్టాలేసుకొని ఆడుకొన్నారు. కుటుంబాల గురించి విశ్లేషణ చేసుకొని, రాబోయే కాలంలో పాఠశాల ఉన్నతికి ఎలాంటి పనులు చేపట్టాలన్న అంశాలపై చర్చించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసారు. పాఠశాల పూర్వపు విద్యార్ధులు (2004-05), ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో భోగి పండుగ

చౌడేపల్లి, జనవరి 14 ప్రభాతవార్త



భోగి మంటలేసుకొంటున్న ప్రజలు

మనిషిలోని అహంకారాన్ని అణచివేసి సుఖశాంతులతో జీవితాన్ని గడిపేందుకు అవసరమయ్యే శక్తినిచ్చే భోగి పండుగను మండల వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్దలతో జరుపుకొన్నారు. ఉదయాన్నే ఇళ్ళముందు భోగి మంటలు వేసుకొని భక్తిని చాటుకొన్నారు. దేవస్థానాలకు వెళ్ళి విశేష పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మృత్యుంజయేశ్వరస్వామి, బోయకొండ గంగమ్మ, రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి, కమల, అభయాంజనేయస్వామి, పుదిటపట్ల పంచలింగేశ్వరస్వామి, వైష్ణవీదేవీ, లద్దిగం జలకంఠేశ్వరస్వామి, శెట్టిపేట మోక్షగణపతి తదితర ఆలయాల్లో భోగి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

## వేణుగోపాలస్వామికి ఏకాదశి పూజలు

చౌడేపల్లి, జనవరి 14 ప్రభాతవార్త



పట్టణంలోని రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో భోగి పండుగను పురష్కరించుకొని పంచామృతాభిషేకం, విశేషాలంకరణ గావించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారందరికీ నిర్వాహకులు పవిత్ర తీర్ధ ప్రసాదాలందించారు.

## వైభవంగా బోగివేడుకలు

రామసముద్రం జనవరి 14 ప్రభాతవార్త



పెద్దపండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటి రోజున జరిపుకునేది బోగి పండుగని అందులో బాగానే బుధవారం పలు గ్రామాల్లో ప్రజలు బోగి పండుగను ఇళ్ల ముందు పనికి రాని కొయ్యలు, అట్టపెట్టెలు వేసి సూర్యోదయం పుట్టక మునిపే బోగి మంటలు వేసి ఘనంగా జరుపుకున్నారు. చిన్నపిల్లలు ఉదయం తలంటి స్నానం చేసి చిన్నపిల్లలకు తలపై రేగిపళ్ళను పోసి ఆశీర్వాదములు ఇచ్చారు. మహిళలు ఇంటి ముందర రంగు రంగుల రంగవల్లికలు వేసి మధ్యలో గొబ్బేమ్మలు పెట్టి వాటి మధ్యలో తంగేడుపూలు, తీలుపూలు, గురుగుపూలు, గుమ్మడి పూలు అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. బోగి అనే పండుగ సంస్కృత పదం నుండి బోగి అనే పదం వచ్చింది. భోగం అంటే సుఖం, పూర్వం ఈ దినమే శ్రీ రంగనాథస్వామిలో గోదాదేవి లీనమై బోగాన్ని పొందిందని దీని సంకేతంగా భోగిపండుగ ఆచరణలోకి వచ్చిందని మనపూర్వికుల పురాణ దక్షిణాయానికి చివరిరోజుగా బోగిని భావిస్తారు. దక్షిణాయంలో పడ్డ కష్టాలు భాధలను భోగి మంటలలో రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణ కాలంలో సుఖ సంతోషాలను ప్రసాధించాలని కోరుకుంటూ భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గురువారం పశువుల పండుగను పలు గ్రామాల్లో జరుగుతుంది.

## రైతు చల్లగుంటే లోకం సుభిక్షం

పీలేరు జనవరి 14 ప్రభాతవార్త:



కొత్త సంవత్సరంలో రైతు కష్టపడి పండించిన పంటలు ఇంటి కి వచ్చే సమయం. పశువులను దేవతలాగా పూజించే సమయం ఇంటి ముందట గొబ్బెమ్మలతో పిండి వంటలతో బంధువుల సందడితో కొత్తగా పెళ్లయిన జంటలతో నూతన వస్త్రాల అలంకరించికొని పిల్ల పెద్ద ముసలి ముతక అందరూ సంతోషంగా జరుపుకునే పండగ సంక్రాంతి భోగిమంటలతో హరిదాసుల ఇంటింట పాటలతో ముత్యాల ముగ్గులతో చెరుకు గడులతో హిందూ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా చేసుకునే ఏకైక పండుగ సంక్రాంతి వచ్చిందంటేనే ఆ కతే వేరే లెవెల్. చెరుకు గడులతో పాలు వెన్న పెరుగుతో గంగిరెద్దుల విన్యాసాలతో పల్లెల్లో ఐకమత్యంగా పలకరింపు దోసెల పండగల చల్లో చల్ల అంటూ పండగ రోజు గంగమ్మ తల్లికి దోసెలు వేస్తూ పశువులను శుభ్రం చేసే అలంకరించి సంధ్య వేళ కాటమరాజుచుట్లకుప్పల పతంగుల పోటీలు కబడ్డీ పోటీలు క్రికెట్ పోటీలు పాటలు పోటీలు ముగ్గులు పోటీలు ఎడ్ల పోటీలు కోళ్ల పందాలు తో సందడే సందడిగా ఉండే సంక్రాంతి అంటేనే మన సాంప్రదాయాలకు సంస్కృతికి నిదర్శనం. మతాలకతీతంగా చేసుకునే ఏకైక పండగ సంక్రాంతి క్యాలెండర్లో మొదటి పండుగ సంక్రాంతి ముచ్చటగా మూడు రోజుల పండుగ సంక్రాంతి వచ్చింది తుమ్మెద సరదాలు తెచ్చింది కొత్త అల్లుళ్లతో పాటలతో గ్రామీణ ప్రాంతాలను ఉర్రూతలుగించే ఉషారైన పాటలతో గమ్మెతించే గొబ్బెమ్మలతో రకరకాల పుష్పాలు ఇంటి ముందట సూర్యోదయం ముందే సందడి చేసే గొబ్బెమ్మలు చూడ చక్కని గ్రామీణ ప్రాంతం ఎక్కడ చూసినా సెలయేర్లు పచ్చని పంటలు వెచ్చని మంటలు చూద్దాం రారండి సంక్రాంతి వచ్చింది.

# మున్సిపాలిటీలకు విడుదలైన 15 ఆర్థిక సంఘం నిధులు ఏమయ్యాయి ?

**రాష్ట్రవ్యాప్తంగా ఒకటిన్నర సంవత్సరంగా బిల్లుల చెల్లింపు బంద్**

**జగన్ హయాంలో ఇంతే...**

**చంద్రబాబు పాలనలో కూడా ఇంతేనా?**

**కేంద్రం నిధులు మళ్లించారా?**



రాజంపేట మున్సిపాలిటీలో 2024 సెప్టెంబర్ లో వేసిన ఈ సిమెంట్ రోడ్డుకు ఇంకా బిల్లులు చెల్లింపు జరగలేదు

రాజంపేట, జనవరి 14 ప్రభాతవార్త

రాష్ట్రంలో మున్సిపాలిటీలకు కేటాయించిన పద్ధతి ఆర్థిక సంఘం నిధులు ఏమయ్యాయి ఒకటిని సంవత్సరంగా మున్సిపాలిటీ పనులు చేసిన కాంట్రాక్టర్లు పాలక ప్రతిపక్ష నాయకులు బిల్లులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అధికారులు మాత్రం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే తామేమి చేయగలమంటున్నారు. అసలు 15వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నాయా? లేక గత ప్రభుత్వం లాగానే కూటమి ప్రభుత్వం కూడా ఈ విధులను దారి మళ్ళించిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపులు జరుగుతున్న తీవ్ర జాప్యం పై వార్త అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది. 15 ఆర్థిక సంఘం నిధులు 2020 21 ఆర్థిక సంవత్సరం నుంచి మున్సిపాలిటీలకు, గ్రామపంచాయతీలకు కేటాయింపులు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 2021, 26 ఆర్థిక సంవత్సరం వరకు 1. 20 లక్షల కోట్ల నిధులు అర్బన్ లో కల్ బాడీలకు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్రానికి కూడా జనాభా ప్రకారం నిధులు కేటాయించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధులను దారి మళ్లించింది .దీంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో నాయకులు, కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు జంకే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా 2021 ఆర్థిక సంవత్సరం నుంచి పనులు చేయకపోవడంతో అధికారులు కొత్త ఎస్ ఎస్ ఆర్ వచ్చినప్పుడల్లా సవరించి అంచనాలను సిద్ధం చేస్తూ గడిపేవారు .అయితే 2024 జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక సంఘం నిధులు విడుదల లో పరిస్థితి మారుతుందని నాయకులు, కాంట్రాక్టర్లు భావించారు. వెంటనే టెండర్లలో పాల్గొని పనులు చేయడం ప్రారంభించారు. అయితే జగన్ హయాంలో జరిగిన విధంగానే చంద్రబాబు సర్కార్ కూడా మున్సిపాలిటీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన బిల్లులకు బిల్లుల చెల్లింపు నిలిపివేసింది .సి ఎఫ్ ఎం ఎస్ లో అప్లోడ్ అయిన బిల్లుల పక్కన పెట్టారు. ఆ తర్వాత పిఎఫ్ ఎంఎస్ ప్రకారం బిల్లులు అప్లోడ్ చేశారు .అయినా కూడా పరిస్థితిలో మార్పు లేదు. అయితే కార్పొరేషన్ లో మాత్రం జనరల్ ఫండ్ నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించి ఆ తర్వాత అడ్జస్ట్మెంట్ చేసుకోవచ్చని సూచించారు. దీంతో ఈ పనులకు చెక్కులు ఇవ్వడం ప్రారంభించారు. మున్సిపాలిటీలో మాత్రం కమీషనర్లు అందుకు విముఖత వ్యక్తం చేయడంతో బిల్లుల చెల్లింపు జరగలేదు. ఫలితంగా బిల్లుల చెల్లింపు నిలిచిపోవడం జరిగింది. సి ఎఫ్ ఎంఎస్ లో అప్లోడ్ చేసిన బిల్లులు మంజూరు కాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్లు పలుమార్లు కేంద్రం నిధులతో చేపట్టిన పనులకు బిల్లులో చెల్లింపులో సమస్య లేదని కేంద్రం నిధులు మళ్ళించమని ప్రకటించారు. గ్రామ పంచాయతీల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. మున్సిపాలిటీలో మాత్రం ఎందుకు చేయలేదన్నది జవాబు లేని ప్రశ్నగా మారింది. మున్సిపల్ ఖాతాల్లో నిధులు లేకపోవడంతో నిధులు విడుదల చేసినా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని కాంట్రాక్టర్లు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం మంజూరు చేసిన నిధులతో పనులు చేసి ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా బిల్లులు రాకపోవడం దారుణమని వ్యాఖ్యానిస్తున్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చిన తర్వాత ఒక మాట అంటూ విమర్శిస్తున్నారు. తాజాగా మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ రాష్ట్ర పరిపాలన కార్యాలయం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టి బిల్లులు మంజూరు కాని వివరాలు పంపాలని సర్క్యులర్ అందినట్లు తెలిసింది. ఏడాది మార్చి 30నాటికి 15వ ఆర్థిక కమిషన్ ముగుస్తుంది.రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన బిల్లులు మంజూరయ్యేలాచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సదుం ఎస్సైగా విష్ణు నారాయణ

సదుం జనవరి 14 ప్రభాతవార్త

సదుం మండల ఎస్సైగా విష్ణు నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిమ్మనపల్లిలో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్షావలి వీకోటకు ఎస్సైగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతికి కోడిపందాలు, జూదం వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం తదితరల పై చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## ఎక్స్‌టెన్షన్ బ్రిడ్జ్ ప్రారంభించిన అధికారులు



యర్రగుంట్ల జనవరి 14 ప్రభాతవార్త:

రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ ఎక్స్ టెన్షన్ బ్రిడ్జ్ ను బుధవారం యర్రగుంట్ల రైల్వే అధికారులు ప్రారంభించారు. గుంతకల్ రైల్వే డిఆర్ఎం చంద్రగుప్త ఆదేశాల మేరకు బ్రిడ్జ్ ను ప్రారంభించినట్లు యర్రగుంట్ల రైల్వే స్టేషన్ మాస్టర్ సంపత్ కుమార్ తెలిపారు. బ్రిడ్జి ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ మణికుమార్, ఆర్ పి ఎఫ్ ఏఎస్ఐ అబ్దుల్ సలాం, యర్రగుంట్ల వైసిపి కౌన్సిలర్ అలీతోపాటు, వైయస్సార్సీపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మాడిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డివామి దగ్ధం : రూ. 50వేలు ఆస్థినష్టం



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

చౌడేపల్లి, జనవరి 14 ప్రభాతవార్త

గడ్డివామి దగ్ధమై రూ. 50వేల వరకు ఆస్థినష్టం సంభవించిన సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. పుంగనూరు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు కథనం మేరకు మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ చుక్కావారిపల్లి మురళికి గ్రామం మధ్యలోనే గడ్డివామి వుంది. సాయంత్రం గడ్డివామి నుంచి మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. పుంగనూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది తరలివచ్చి మంటలను పూర్తిగా అదుపు చేసారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ. 50వేల వరకు ఆస్థినష్టం సంభవించినట్లు సుబ్బరాజు తెలిపారు.

## మండలంలో పర్యటించిన ఎంపీ

ముద్దనూరు,జనవరి14,ప్రభాతవార్త:



మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో బుధవారం ఎంపీ అవినాష్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి మండల వైసిపి కన్వీనర్ శ్రీధర్ రెడ్డి గృహంలో కుటుంబ సభ్యులు మరియు కార్యకర్తలతో ఆప్యాయంగా పలకరించుతూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మండల మాజీ ఎంపీపీ మునిరాజా రెడ్డి నివాసంలో మండల నాయకులను, కార్యకర్తలను కలిసి వారి యోగక్షేమాలు కనుక్కున్నారు. కార్యకర్తలు ఎంపీ దృష్టికి వైసిపి కార్యకర్తల పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు.ఎంపీ మాట్లాడుతూ ఎవరు అధైర్య పడకూడదని ఏ సమస్యలు వచ్చినా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తే తక్షణమే పరిష్కరిస్తారని ఈ సందర్భంగా కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్.ఈ.సీ మెంబర్ గిరిధర్ రెడ్డి ,శివారెడ్డి డాక్టర్ నవజ్యోత్ రెడ్డి ,నాయి బ్రహ్మణ జిల్లా అధ్యక్షుడు గురప్ప, మణికంఠరెడ్డి వైసీపీ నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు..

## బిసి అభ్యర్థి సింగల్ విండో అధ్యక్షులు కావడం విశేషం

నిమ్మనపల్లె, జనవరి 14 ప్రభాతవార్త :



బిసి అభ్యర్థిని సింగల్ విండో అధ్యక్షులు చేయడం తెలుగుదేశం పార్టీకి చెందునని మండల మాల మహానాడు అధ్యక్షులు మాణిక్యం అన్నారు. బుధవారం స్థానిక సింగల్‌విండో కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన తుర్రా వెంకటరమణకు ఘనంగా దుశ్శాలవాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో సిఈఓ హరినాథ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాజన్న, టిడిపి నాయకులు మునిరత్నం, సింగల్‌విండో త్రిమ్యాన్ కమిటీ సభ్యులు చెంగ్రాయుడు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం అభివృద్ధి కొరకు విరాళం అందజేత



యర్రగుంట్ల జనవరి 14 ప్రభాతవార్త:

మండల పరిధిలోగల కోడూరు గ్రామం నందు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ మహాయజ్ఞం కొరకు గ్రామ పెద్దలు,గ్రామస్తుల సమక్షంలో బుధవారం కీ.శే. శిరిగిరెడ్డి చిన్న రామిరెడ్డి ఆయన కుమారుడు అంజిరెడ్డి మనవడు శివానందరెడ్డి దేవాలయం అభివృద్ధి కొరకు రూ.6,01,596 విరాళాన్ని ఆలయ కమిటీ సిబ్బందికి అందజేశారు అలాగే మల్లు వెంకట శివా రెడ్డి ఆయన ధర్మపత్ని రూ.1,01,116. విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఈ ఆలయ చైర్మన్ మల్లు గోపాల్ రెడ్డి, మల్లు రంగారెడ్డి, కొత్తపు వాసుదేవ రెడ్డి, దాసరి రామచంద్ర రెడ్డి, మల్లు మోహన్ రెడ్డి, రామిరెడ్డి పురుషోత్తం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి , సుధాకర్ రెడ్డి, చిన్న వీరారెడ్డి పాల్గొన్నారు.

## రాయలసీమ నీటి ప్రాజెక్టుల కోసం వైసీపీ చేసింది ఏమీ లేదు

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 14, ప్రభాత వార్త



ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెల లింగారెడ్డి బుధవారం స్థానిక ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ నీటి ప్రాజెక్టుల కోసం వైసీపీ హయాంలోనే అధికంగా ఖర్చు చేశామని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా వున్న సమయంలో వాస్తవానికి కేవలం 2000 కోట్ల రూపాయలే సీమ త్రాగు, సాగు నీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశారని, కానీ గాలేరు నగరి, హంద్రీ నీవా పనులు చంద్రబాబు నాయుడు చేస్తే అవి తాను చేశానని చెప్పుకోవడం దారుణమన్నారు. అప్పులు, రాయలసీమ ప్రాజెక్టులు, పారిశ్రామికీకరణ, ఉద్యోగాల విషయంలో తాను క్రెడిట్ కొట్టేయాలని జగన్ దుర్మార్గంగా ఆలోచిస్తున్నారని విమర్శించారు. వీటిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## గాంధీ పార్క్ వాకర్స్ ఆధ్వర్యంలో భోగి సంబరాలు

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 14 ప్రభాత వార్త



ప్రొద్దుటూరు పట్టణంలోని మున్సిపల్ గాంధీ పార్క్ వద్ద బుధవారం భోగి పండుగ సందర్భంగా న్యూ వాకర్స్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేసి తీపి పదార్థాలు పంచుకొని ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరంలో రైతులు కొత్త పంటలు చేతికంది సుఖ సంతోషాలతో వెల్లివిరియాల అని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రత్నమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

పీలేరు జనవరి 14 ప్రభాతవార్త:



నియోజకవర్గంలోని కలికిరి మండలంలో గ్రామానికి చెందిన దళిత మహిళ భూముల విషయంలో ఆమెకు న్యాయం చేయకపోతే రెవెన్యూ కార్యాలయం ఎదుటి మాల మహానాడు రాష్ట్ర ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు సిద్ధమవుతామని మాల మహానాడు నాయకులు వేమన సుదర్శనం మన్యం చంద్ర, వడ్డేహరీలు తెలిపారు. ఆన్లైన్లో ఉన్న దళిత మహిళ భూములను కొంతమంది రెవెన్యూ అధికారులు దగ్గర లంచం తీసుకుని వారి పేరిట మార్చి వేసినట్లు రికార్డులు తేలడంతో గత నెల క్రితం రాష్ట్ర ఎస్సీ కమిషనర్ తో తమ సమస్యలను అర్జీ సమర్పించినా అధికారులు స్పందన రావడంలేదని ఇలాగే కొనసాగితే దళితుల పట్ల కలికిరి రెవెన్యూ అధికారులు చూపుతున్న యువతను పత్రికాముఖంగా తెలియజేయడమే కాకుండా ధర్నాలు సైతం చేసేందుకు సిద్ధమవుతామని అదే విధంగా స్థానిక శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి వినతి పత్రం ఇచ్చేందుకు వెనుకాడబోమని వారు హెచ్చరించారు. ఇకనైనా అసలైన భూమి యజమానురాలు రత్నమ్మకు న్యాయం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో వడ్డే హరి ,రమణ సుదర్శనం ,మన్నెం చంద్ర, రత్నమ్మ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## భోగి సందర్భంగా

# 11 మంది జూదరులు అరెస్ట్.

తంబళ్లపల్లె జనవరి 14 ప్రభాతవార్త ః

భోగి పండుగ సందర్భంగా కోడి పందాలు రూపంలో జూదమాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై టి.అనిల్ కుమార్ విలేకరులకు తెలిపారు. తంబళ్లపల్లె మండలం జుంజురపెంట గ్రామం చిన్న మూలకుంట చెరువు వద్ద జూదమాడుతున్న 11 మంది ని ఎస్సై టి.అనిల్ కుమార్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వారి పై కేసు నమోదు చేసి నిందితుల నుండి రూ 5900 సొమ్ముతోపాటు ఐదు మొబైల్ ఫోన్లో నాలుగు కోడిపుంజులు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా జూదం, కోడి పందాలు, బహిరంగ మద్యపానం చేస్తే ఉపేక్షించేది లేదని కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై హెచ్చరించారు.

# శ్రీ బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు




**బద్వేల్ అర్బన్, జనవరి 14 ప్రభాతవార్త :**
శ్రీ బద్దెన కళా పీఠం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించడం జరిగింది. స్థానిక పెన్షనర్స్ హోమ్ లో ఈరోజు ఉదయం 10 గంటల నుండి వేడుకలను నిర్వహించడం జరిగింది. ఉదయం 9.30 నిమిషాలకు శ్రీ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలోని బద్దెన విగ్రహానికి గజమాలను వేసి నివాళులు అర్పించి, తదుపరి సరస్వతి మాత గుడిలోపూజలు చేయడం జరిగింది. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంగీత సాహిత్యనిధి పురస్కార గ్రహీత, సంగీత అవధాని, కవి చంద్ర బిరుదాంకితులు శ్రీ యలమర్తి మధుసూదన గారు కడప నుండి విచ్చేసినారు. వారు సుమతీ శతక ప్రాశస్త్యం గురించి 13వ శతాబ్దము నాటి సామంత రాజు అయిన బద్దెన కవి రాసిన విశిష్టమైన సుమతీ శతకము లోని కందపద్యముల గురించి వివరించి విద్యార్థిని, విద్యార్థులకు, ప్రేక్షకులకు తెలిపారు. తన సంగీతామృతంతో సాహిత్యం జోడించి అందర్నీ ఆకర్షితులను చేశారు. " అక్కరకు రాని చుట్టము మొక్కిన వరమీని వేల్పు" అను పద్యము "బలవంతుడ నాకేమని పలువులతో నిగ్రహించి " అను పద్యము, " ఇచ్చునదే విద్య రణమున చొచ్చునదే మగతనంబు" అను పద్యమును "అప్పిచ్చువాడు, వైద్యుడు ఎప్పుడు ఎడతెగక పారు ఏరును" అను పద్యములు వివరిస్తూ విద్యార్థిని, విద్యార్థులకు పరిచయం చేశారు. సంక్రాంతి పండుగ ప్రాశస్త్యమును బద్దెన కళాపీఠం నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బైసాని శివరామి రెడ్డి గారు బద్దెన కళాపీఠం నిర్వహించు కార్యక్రమాల గురించి ప్రశంసించారు. శ్రీ బద్దెన కళాపీఠం అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డి మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను, ఆచారాలు కాపాడేందుకు బద్దెన కళాపీఠం గత 30 సంవత్సరముల నుండి సేవలు అందిస్తుందని అందుకు పట్టణంలోని కళాకారులు, సాహితీప్రియులు సంపూర్ణంగా సహరి సహకరిస్తున్నారని తెలిపారు. సంక్రాంతి సంబరాలలో కళా పీఠం ప్రధాన కార్యదర్శి బలపనూరు శంభూ ప్రసాద్, ఉపాధ్యక్షులు సివి నాగేశ్వరరావు, వాకమల్ల రాఘవరెడ్డి, వాకారామయ్య, గోనుగుంట వెంకటసుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శి మన్నేపల్లి రాజయ్య, సాంస్కృతిక కార్యదర్శులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, కోటపాటి ఓబులేసు కార్యదర్శులు కత్తి బ్రహ్మయ్య, బోధన బోయిన మల్లికార్జునరావు కె.వి సుభాష్ కుమార్, పీవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.22 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో ఒక్కొక్క పాఠశాలలో పోటీలు నిర్వహించి అందులో ముగ్గురిని ఎన్నిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు మరియు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఆయా పాఠశాలల నుండి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బద్వేల్లో వైభవంగా సంక్రాతి వేడుకలు

**బద్వేల్ అర్బన్ జనవరి 14 ప్రభాతవార్త :**
బద్వేల్ పట్టణంలో అమ్మవారి శాల వీధి, వాసవి అపార్ట్మెంట్, సిద్ధవటం రోడ్ సుమిత్రానగర్, అశోక్ నగర్, ఆంజనేయ నగర్ మరియు పలు వీధులలో సంక్రాంతి పండగలో మొదటి రోజు భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలు అత్యంత ఉత్సాహంతో భోగి పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు ఎన్నడూ లేనివిధంగా తెల్లవారుజామున 4, గంటల నుంచి భోగిమంటలు వేసి పాతదాన్ని వదిలేసి కొత్త దానికి ఆహ్వానం పలుకుతూ భోగి వేడుకలను జరుపుకున్నారు . అలాగే తలంటు స్నానం చేయడం వంటివి ప్రజలలో ఉత్సాహాన్ని నింపాయి ప్రతి ఏడాది సంక్రాంతి పండుగకు సొంత ఊర్లోకి రావడం మూడు రోజులు పాటు ఈ పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఈ సంక్రాంతి పండగలో భాగస్వాములై జరుపుకోవడం సాంప్రదాయం. ఎక్కడో దూర ప్రాంతాలలో ఉన్న వారు కూడా తమ సొంత ఊరికి రావడం, ఇంటి వద్ద తమకు తోచిన వివిధ రకాల పిండి వంటలు చేసుకోవడం విందు భోజనం చేయడం ఆనవాయితీ. ఇది ప్రతి ఒక్కరు ఈ పండుగను అత్యంత ఉత్సాహంగా జరుపుకోవడం, ఆఖరి రోజున పశువులను అలంకరించి వాటికి పూజలు చేయడం ఆనవాయితి. ఈ ఏడాది సంక్రాంతి పండగ పట్టణంలోని ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు,ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ప్రసాద్ మాజీ ఆర్యవైశ్య వర్ధక సంఘం అధ్యక్షులు కే.వీ సుబ్బారావు, ఎస్వి సుబ్బారావు,పెసల సుబ్రహ్మణ్యం, వనిత క్లబ్ జోన్ చైర్మన్ చింతకుంట ధనలక్ష్మి, వనితా క్లబ్ ట్రెజరర్ బచ్చు పార్వతి, సెక్రెటరీ చిప్పగిరి వెంకటసుబ్బమ్మ, వనిత క్లబ్ మాజీ అధ్యక్షురాలు హత్య హేమలత అలాగే అశోక్ నగర్కు చెందిన పబ్బతి హాజరత్, సత్యనారాయణ వాసవి వనిత క్లబ్ సభ్యులు పలువురు అమ్మవారి శాల వీధిలో యూత్ మాట్లాడుతూ కొలపర్తి శరత్, పుచ్చేటి బాల సుబ్రహ్మణ్యం, కుప్పం వెంకట లోకేష్, సుబ్రహ్మణ్యం శర్మ, కొలిశెట్టి సుబ్రహ్మణ్యం, గంగిశెట్టి కృష్ణవంశీ, చలపాటి అనీష్ , పుచ్చేటి వెంకటసుబ్బయ్య పలువురు ప్రజలు అందరికీ భోగి శుభాకాంక్షలు తెలియజేశారు.





## పట్టణంలో భోగి మంటలు



**పీలేరు జనవరి 14 ప్రభాతవార్త**
ఉపాధ్యాయ మిత్ర బృందం భోగి మంటలు వేసి చలికాచుకున్నారు. మూడు రోజుల సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా మొదటి రోజు బుధవారం ఉదయం పీలేరు పట్టణం, ఎస్.వి. డీలక్స్ రోడ్డు, జర్నలిస్టు కాలనీలో ప్రతీ సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా అయ్యోర్లు , కాలనీ ప్రజలు ఆనవాయితీగా ఉదయాన్నే భోగి మంటలు వేసుకుని చలి కాచుకున్నారు. పట్టణానికి, ప్రజలకు పట్టిన చీడపీడలు తొలగాలని కోరుకుంటూ వారు భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ మిత్రులు, మానవత సంస్థ సభ్యులైన డాక్టర్ వంగిమల్ల రామచంద్ర, శెట్టి సుబ్రమణ్యం, డాక్టర్ ప్యోతశెట్టి రమేష్, వైవీ రమణ, కృష్ణమూర్తి, రహత్ బాష, సుధాకర్ బాబు, అక్రం బాష, రాజేంద్ర, గఫార్ సాహెబ్, కరీముల్లా, ఖాదర్ బాష, రమణారెడ్డి, జర్నలిస్ట్ కాలనీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రజకులకు కేటాయించిన దోబీ ఘాట్ స్థలంలో ఇతర నిర్మాణాలు చేపట్టడం తగదు



**బద్వేలు అర్బన్ ,జనవరి 14, ప్రభాతవార్త, :**
రజక వృత్తిదారులకు కేటాయించిన దోబీ ఘాట్ స్థలంలో స్వచ్ఛభారత్ పేరుతో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టడం సరికాదని, ఆ స్థలాన్ని రజకులకే కేటాయించి అభివృద్ధికి దోహదపడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తుదారుల సమైక్య నాయకులు బద్వేల్ రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు బద్వేల్ పట్టణంలో నివసిస్తున్న రజక వృత్తిదారుల జీవనోపాధి కోసం సుమారు 30 సంవత్సరాల క్రితం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సహకారంతో మడకల వారిపల్లి గ్రామం, శివాలయం సమీపంలో సర్వే నంబర్ 10/42లో ఒక ఎకరా 20 సెంట్ల స్థలాన్ని దోబీ ఘాట్ కోసం కేటాయించేందుకు అప్పటి అధికారులు ప్రతిపాదనలు పంపారని నాయకులు గుర్తు చేశారు. 2003 సంవత్సరం నుండి అక్కడే సుమారు 150 కుటుంబాల రజకులు తమ జీవన వృత్తిని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ మధ్యకాలంలో మున్సిపాలిటీ అధికారులు కరెంట్ మీటర్ తొలగించడంతో నీటి సరఫరా నిలిచిపోయి రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని గోపవరం తహసిల్దార్ ఉద్దేశపూర్వకంగా ఆ స్థలాన్ని మున్సిపాలిటీ అధికారులకు చూపించడంతో, అక్కడ స్వచ్ఛభారత్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించారని ఆరోపించారు. ఇప్పటికే కంపచెట్లు తొలగించి పనులకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. దోబీ ఘాట్ స్థలం ఊరి బయట, జనావాసాలు లేని ప్రాంతంలో ఉండటంతో అక్కడ వాటర్ ప్లాంట్ నిర్మించినా ప్రజలకు ఉపయోగకరంగా ఉండదని, ప్రజల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న ప్రాంతంలోనే వాటర్ ప్లాంట్ ఉండాలని వారు సూచించారు. ఇదే స్థలంలో కొంతమంది అక్రమార్కులు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని, రజకులకు ఏమైనా అన్యాయం జరిగితే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తుదారుల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వీరశేఖర్, సహాయ కార్యదర్శి పొంగూరు నాగరాజు, మాడపూరు వెంకటసుబ్బయ్య, కొట్టాలపల్లి సుబ్బరాయుడు, గానుగపెంట వెంకటరమణ, జయరాం, పుల్లమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.









## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మకరజ్యోతి దర్శనం

**సదుం జనవరి 14 ప్రభాతవార్త**



మండల పరిధిలోని ఎర్రతి వారి పల్లె బురుజు కొండపై వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో బుధవారం మకరజ్యోతి దర్శనం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి స్థానిక చదుమమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి తీరువాభరణాలను పుంగనూరు శాసనసభ్యులు, ఆలయ చైర్మన్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఊరేగింపుగా తీసుకొని వచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు నంబూద్రి నారాయణ స్వామివారికి తిరువాభరణాలు అలంకరించారు. అనంతరం సాయంత్రం తూర్పు దిక్కున మకర జ్యోతి దర్శనాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆలయం ఎదురుగా ఏర్పాటుచేసిన కుండంలో కర్పూరం వేసి వెలిగించారు. ఇందులో భాగంగా ఆలయం లోపల చుట్టుపక్కల కర్పూరం పెట్టి భక్తుల చేత వెలిగింపజేశారు. ఈ సందర్భంగా స్వామియే శరణమయ్యప్ప అంటూ ఎర్రాతి వారి పల్లె ఆలయం మారుమోగిపోయింది. అంతకుముందు ఉదయం నాలుగు గంటలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులు 18 పడిమెట్ల ఎక్కి ఇరుముడులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, మదనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, వైఎస్ఆర్సిపి యూత్ రాష్ట్ర కార్యదర్శి కళ్యాణ్ భరత్, చిత్తూరు జిల్లా మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సదుం, సోమల, పుంగనూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్ సీ సీ విద్యార్థులు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



## వైభవం.. గోదాదేవి కల్యాణం



**నందలూరు , జనవరి14 ప్రభాతవార్త:**
మండల కేంద్రంలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద బుధవారం శ్రీ గోదాదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఎంబలూరు అనిల్ కుమార్, రాధిక దంపతులు కల్యా ణానికి ఉభయ దాతలుగా వ్యవహరించారు. ముందుగా ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. పండితులు రామచంద్రయ్య మంత్రోచ్చర ణలు.. భక్తుల గోవింద నామస్మరణల మధ్య కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. అనంతరం అమ్మవారి విశిష్టతను వివరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పల్లె నాగ మోహన్, గండికోట చిన్న సుబ్బరాయుడు, పసుపులేటి రామచంద్రయ్య, శ్రీను, లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పులివెందులలో భోగి మంటలు

**పులివెందుల, జనవరి 14, ప్రభాతవార్త :**



పట్టణంలోని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి స్వగృహం వద్ద స్థానిక నాయకులతో కలసి భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో సంప్రదాయ బద్ధంగా భోగి మంటలు ఏర్పాటు చేసి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీలో విజేత గుడిపాడు

**దువ్వూరు, జనవరి 14, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కబడ్డీ పోటీలు మంగళ, బుధవారాల్లో జరుగగా వివిధ ప్రాంతాల నుండి 13 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో గుడిపాడు సూర్య జట్టు ప్రథమ స్థానం సాధించి 10వేల రూపాయలు, అలాగే మాసన పల్లె జట్టు రెండవ స్థానం సాధించి 6 వేలు, గుడిపాడు రఫీ జట్టు మూడవ బహుమతి 3 వేల రూపాయలు గెలుచుకున్నాయి. విజేతలకు రామాలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగను గుర్తు చేసుకుంటూ ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు.



## అయ్యప్ప ఆలయంలో ఘనంగా మకర సంక్రాంతి వేడుకలు

**రాజంపేట, జనవరి 14 ప్రభాతవార్త**
పట్టణంలో జాతీయ రహదారి మణికంఠ నగర్ లో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హరిహరసుడు అ




య్యప్ప స్వామికి తెల్లవారుజామునే జలాభిషేకంతో ప్రారంభించి పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి పూలాభిషేకంతోఅష్టోత్తర శతనామావళి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తదుపరి అయ్యప్ప పల్లకి సేవ ఘనంగా జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఏడు గంటల వరకు అయ్యప్ప స్వామి మకర జ్యోతి దర్శనం కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ, ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ, ఆలయ చైర్మన్ పాల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు దాము ఆచారి, గురుస్వాములు వెంకటసుబ్బయ్య,సుధాకర్, రమేష్,అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## బుడి బుడి అడుగుల చిన్నారుల గొబ్బిళ్ళు ఆట



**తంబళ్లపల్లె జనవరి 14 ప్రభాతవార్త :**
అలనాటి మన తెలుగు సాంప్రదాయాలను నేటి ఆధునిక సమాజం మర్చిపోతున్న వేళ కనీసం నడకలు సైతం రాని చిన్నారులు బుడిబుడి అడుగులతో భోగి పండుగ సందర్భంగా గొబ్బిళ్ళ ఆట ఆడిన సన్నివేశం సభికులను ఆశ్చర్యపరిచింది. తంబళ్లపల్లి మండలం పరసతోపు పంచాయతీ కురువపల్లి అంగన్వాడి సెంటర్లో కార్యకర్త చిన్నారులకు విద్యతోపాటు ఆటలు, పాటలతో పాటు మన పూర్వీకులు సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచిన గొబ్బిళ్ళ ఆట నేర్పించి వారి చేత ప్రదర్శింపజేయడం హర్షనీయం.

## ఘనంగా బోగి పండుగ

### ఇంటిముందు మంటలతో పూజలు



మదనపల్లెలో వేసిన బోగిమంటలు

**మదనపల్లె, జనవరి 14 ప్రభాతవార్త:**
సంక్రాంతి పండుగల్లో ముఖ్యమైన బోగి పండుగను బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని నివాస గృహాల ముందు అగ్గిమంటలు వేసి పూజలు చేశారు. వేకువజామున కట్టెలు, తుప్పు పట్టిన కొయ్యలు, చెత్తాచెదారంతో మంటలు వేశారు. బోగిపండ్లు పిల్లల మీద పోసి స్నానాలు చేయించారు. అక్కడక్కడా ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఇండ్లముందు పోటీలు పడి ముగ్గులు వేసుకొన్నారు. వేసిన ముగ్గులకు రంగులు కొట్టి అందంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా మహిళలు ఉపవాసాలతో బోగిపండుగను జరుపుకొన్నారు. పట్టణంలోని పలు అసోసియేషన్ సభ్యులు కలసి బోగిపండగను సంబరాలు ఘనంగా జరిగాయి. త్యాగరాజువీధిలో ఆర్.శిశిర, పర్ణికల ఆధ్వర్యంలో ఘనంగా బోగిమంటలు వేశారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేసి బోగి వేడుకలను జరిపారు.ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బోగిమంటల్లో పాల్గొని పూజలు చేశారు. అదే విధంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి బోగిమంటలను వేసి పూజలు నిర్వహించారు. పట్టణంలో ప్రతి వీధిలోనూ బోగిపండగ వైభవంగా జరిగింది.

## సత్సంగ్ ఫౌండేషన్‌తో మీట్స్ యూనివర్సిటీ ఎం.వో.యూ

**కురబలకోట జనవరి 14 ప్రభాతవార్త**



సత్సంగ్ ఫౌండేషన్ కు చెందిన స్వస్థత హాస్పిటల్ తో మదనపల్లి సమీపంలో ని మీట్స్ యూనివర్సిటీ తో ఎంఓయు. జరిగింది. బుధవారం కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి సమీపంలోని మీట్స్ యూనివర్సిటీతో ప్రముఖ సామాజికవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ మహమ్మద్ అలీకి చెందిన సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని స్వస్థత హాస్పిటల్ యాజమాన్యంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ లో జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ .సి. యువరాజు మాట్లాడుతూ స్వస్థత హాస్పిటల్ యాజమాన్యంతో మీట్స్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రారంభం నుండి యూనివర్సిటీ స్థాయికి ఎదిగిన ప్రస్థానం గురించి తెలియజేశారు. యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులకు, అధ్యాపకులకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి అందిస్తున్న మౌలిక వసతులు, విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీలలో వారు పొందిన ఉద్యోగాల గురించి తెలిపారు. స్వస్థత హాస్పిటల్ డాక్టర్ ఆదర్శ రెడ్డి మాట్లాడుతూ తమ సత్సంగ్ ఫౌండేషన్ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు గిరిజనులు ఉచితంగా అందిస్తున్న విద్యా, వైద్య సదుపాయాల గురించి తెలిపారు. అంతేకాకుండా మదనపల్లికి సమీపంలోని నక్కల దీన్నే వద్ద అధునాతన సౌకర్యంతో పేద ప్రజల కోసం స్వస్థత హాస్పిటల్ నిర్మించిందని ఈ హాస్పిటల్ లో డెంటల్, ఆర్తో .గైనిక్, ఆప్తమ, న్యూరో వంటి జబ్బులకు ప్రముఖ పేరు పొందిన డాక్టర్స్ బృందం ఉందని పేదవారికి కేవలం బెడ్, ల్యాబ్ ఛార్జింగ్ తీసుకుంటూ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా కన్సల్టెన్సీ ఇస్తామని తెలిపారు. మీట్స్ యూనివర్సిటీ తో ఎం ఓ యు కుదుర్చుకోవడం గర్వించి దగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, రిజిస్టర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆర్ఎంవో డాక్టర్ ఆదర్శ్ రెడ్డి, అడ్మిన్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.











